న్యూస్‌రీల్

నర్సరీ సందర్శన



నర్సరీ పరిశీలిస్తున్న దత్తాత్రేయ

కోటపల్లి: పంచాయతీల్లో చేపడుతున్న నర్సరీ నిర్వహణ సక్రమంగా ఉండాలని అడిషనల్ డీఆర్‌డీవో దత్తాత్రేయ సూచించారు. మండలంలోని కోటపల్లి, సర్వాయిపేట గ్రామాల్లోని నర్సరీలను సోమవారం ఆయన పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలను జాగ్రత్తగా పెంచాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నర్సరీ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సర్వాయిపేట 'కంటి వెలుగు' నమునా కార్యక్రమంను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, కార్యదర్శి రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి పూజలు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ అభినవ శబరిమలై అయ్యప్ప ఆలయంలో ఇరుముడి పూజలు సోమవారం ఘనంగా జరిగాయి. అయ్యప్ప స్వాములు ఇరుముడితో వచ్చి దీక్షను విరమించుకున్నారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఇరుముడి సమర్పించి, దీక్ష విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ వ్యవస్థాపకులు, గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమాచార్యులు ప్రత్యేక పూజలు చేయించి, ఆశీర్వచనం చేసి ప్రసాదాన్ని అందించారు.

రక్షణతో పని చేయాలి

శ్రీరాంపూర్: ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో రక్షణతో పని చేయాలని శ్రీరాంపూర్ ఓసీపీ సేఫ్టీ ఆఫీసర్ వీరయ్య తెలిపారు. గనిపై సోమవారం ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొజీజర్స్ ప్రకారం పని చేయాలని తెలిపారు. నిత్యం రక్షణతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేనేజర్లు సంపత్, వెంకటయ్య, అండర్ మేనేజర్ మల్లారెడ్డి, హెచ్‌ఓఎంలు సదయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

దండేపల్లి: మండలంలోని కొండాపూర్‌కు చెందిన పలువురు, సర్పంచ్ శాంతయ్య, మాజీ సర్పంచ్ భూమన్న ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు, సురేఖ, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు ఏర్పాటు

భీమారం: మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారిలోని భీమారంలో ఆవిడం ఎక్స్ రోడ్డు వద్ద సోమవారం పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఎస్సై గట్ల సుధాకర్ మాట్లాడుతూ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే జాతీయరహదారిపై నిఘా ఉంచేందుకు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మిగితా చోట్ల త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

సన్మానం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెర గ్రామానికి చెందిన జోగురు రాజమల్లు అనే వ్యక్తి ఏడు ఉద్యోగాలు సాధించినందుకు గాను ఎంపీపీ మంత్రి బాపు శాలువాతో ఆయనను ఘనంగా సన్మానించారు.

'కంటి వెలుగు' మాక్ డ్రిల్



బెల్లంపల్లి: మాక్‌డ్రిల్ చేస్తున్న వైద్య,మున్సిపల్ సిబ్బంది

బెల్లంపల్లి/నస్పూర్/వేమనపల్లి/లక్సెట్టిపేట/దండేపల్లి/జన్నారం/చెన్నూర్‌రూరల్/కాసిపేట/జైపూర్/శ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సోమవారం జిల్లా వ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. కంటి జబ్బులతో బాధపడుతున్న వ్యక్తులకు కంటి పరీక్షలు చేసే తీరును మాక్‌డ్రిల్‌లో సమర్థవంతంగా నిర్వహించారు. అధికారులు, వైద్య సిబ్బంది ఏర్పాట్లను పరిశీలించారు. కొన్ని చోట్ల ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో బెల్లంపల్లిలో డెప్యూటీ డీఎంహెచ్ఓ, మున్సిపల్ మేనేజర్ భుజంగం, నస్పూర్‌లో జిల్లా ప్రాజెక్టు అధికారిణి డాక్టర్ అనిత, ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రమేశ్, వేమనపల్లిలో ఎంపీపీ కోలి స్వర్ణలత, ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీఓ బాపురావు, లక్సెట్టిపేటలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, దండేపల్లిలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి ప్రకాశ్, తహసీల్దార్ హన్మంతరావు, జన్నారంలో మండల ప్రత్యేక అధికారి రమేశ్‌కుమార్, ఎంపీడీవో అరుణరాణి, వైద్యాధికారి ఉమా శ్రీ, ఎంపీవో రమేశ్, చెన్నూర్‌రూరల్ కాచన్‌పల్లిలో మండల ప్రత్యేకాధికారి డి.కృష్ణ, కాసిపేటలో మండల ప్రత్యేక అధికారి నీలిమ, ఎంపీడీఓ ఎం.ఎ.అలీం, జైపూర్‌లో మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్‌రావు, తహసీల్దార్ మోహన్‌రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనిల్‌రావు, శ్రీరాంపూర్‌లో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబురాలు..!



బెల్లంపల్లిరూరల్: ముగ్గు వేసి గొబ్బెమ్మ ఉంచుతున్న మహిళ

భీమిని: లక్ష్మీపూర్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



బెల్లంపల్లి: ఇళ్ల ఎదుట ముగ్గులు వేస్తున్న మహిళలు





జన్నారం: గంగిరెద్దు ఆడిస్తున్న వ్యక్తి



భీమారంలో ముగ్గులు వేస్తున్న బాలికలు

మంచిర్యాలఅర్బన్/కాసిపేట/జైపూర్/భీమారం/మందమర్రిరూరల్/భీమిని/వేమనపల్లి/బెల్లంపల్లిరూరల్/చెన్నూర్‌రూరల్/బెల్లంపల్లి/జన్నారం/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/దండేపల్లి/తాండూర్/లక్సెట్టిపేట: జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పర్వదిన వేడుకలు ప్రజలు ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. ప్రతి వీధిలో ముగ్గులు రంగుల హరివిల్లులను తలపించాయి. ఒకరితో ఒకరు పోటీ పడి వేసిన ముగ్గులు చూడముచ్చటను గొలిపాయి. పలువురు మహిళలు సంక్రాంతి నోములు నోముకుని, పసుపు కుంకుమలు వాయినంగా ఇచ్చిపుచ్చుకున్నారు. పిండి వంటలు, విందు వినోదాలతో ఇళ్లన్నీ కళకళలాడాయి. కొత్తగా పెళ్లైన కూతురు, అల్లుడిని ఇంటికి ఆహ్వానించి నూతన వస్త్రాలు అందించి, కట్న కానులను అందజేసి ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకున్నారు. కూతుళ్ల, అల్లుళ్ల రాకతో ఇళ్లన్నీ సందడిని సంతరించుకున్నాయి. యువకులు, చిన్నారులు జోష్‌గా పతంగులను ఎగురవేశారు. సంక్రాంతి వేడుకల్లో గంగిరెద్దులు కానరాకుండా పోగా, హరిదాసులు మచ్చుకైన కనిపించలేదు. సోమవారం కనుమ పండుగను నిర్వహించారు. మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు నివాసానికి వెళ్లి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాపతినిధులు, అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొని సందడిగా గడిపారు.



దండేపల్లి: వాకిట్లో ముగ్గులు వేస్తున్న యువతులు



జిల్లా కేంద్రంలో ముగ్గు వేస్తున్న మహిళ



జన్నారం: గొబ్బెమ్మలను ఉంచుతున్న చిన్నారులు



చెన్నూర్‌రూరల్: విజేతలకు బహుమతులు అందజేస్తూ..



జిల్లా కేంద్రంలో...



మందమర్రిలో...



వేమనపల్లి: ఎడ్లనోము నోముకుంటున్న నవ వధువులు



మంచిర్యాలఅర్బన్: ఎమ్మెల్యే దివాకర్‌రావు నివాసంలో పిండివంటలు తినిపిస్తున్న నాయకులు

సమస్యలను సత్వరం పరిష్కరించాలి

- కలెక్టర్ భారతి హోళ్లికేరి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ భారతి హోళ్లికేరి

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భారతి హోళ్లికేరి ఆయా శాఖల అధికారులకు సూచించారు. కలెక్టరేట్ చాంబర్‌లో అదనపు (స్థానిక సంస్థలు) బి.రాహుల్‌తో కలిసి సోమవారం ప్రజావాణి నిర్వహించారు. బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. నస్పూర్ మండలం విద్యానగర్‌కు చెందిన పిల్లల మర్రి రాధ తన కుమారుడు సీతారం విదేశంలో ఎంఎస్ మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్నాడని, మహాత్మా జ్యోతిబాపూలే విదేశీ విద్యానిధి కింద దరఖాస్తు చేసుకున్నాడని, మంజూరు చేయాలని కోరారు. జన్నారం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన జాదవ్ తిరుపతి తన తల్లికి మండలంలోని గ్రామానికి చెందిన చాపిడి అర్జయ్య తన భూమిని తన నలుగు కుమార్తెల పేరిట రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని, వారి పేర్లను రెవెన్యూ ఆన్‌లైన్‌లో నమోదు చేసి రైతుబంధు ఇప్పించాలని అర్జీ అందజేశారు. మంచిర్యాల మండల కేంద్రానికి చెందిన రావి మనోహర్ తన దరఖాస్తులో చెన్నూర్ మండలం నాగాపూర్ శివారులోని భూమి రావి లక్ష్మీనారాయణ, రావి రామ్మూర్తి పేరిట జాయింట్ పట్టా ఉందని, ఇట్టి భూమిని ధరణి పోర్టల్‌లో రావి లక్ష్మీనారాయణపేరిట నమోదు చేయడం జరిగిందని, ఈ భూమిని ముగ్గురి సమ్మతితో విడదీసే వరకు జాయింట్ పట్టాగా సవరించాలని దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన గుంట అమృతమ్మ తమ పేరిట లక్ష్మీపేట మండల దొడెపల్లి గ్రామ శివారు నందు భూమి ఉందని, ఈ భూమిపై హైకోర్టులో దాఖలు చేసిన సెకండర్ అప్పీల్‌లో పెండింగ్ ఉన్నా పట్టా మార్పు చేశారని, దావా పరిష్కారం అయ్యే వరకు మార్చిన పట్టా రద్దు చేయాలని కోరారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను ఆయా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో కబ్జాకు గురైన భూమిపై ఫిర్యాదు

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ మండలంలోని బావురావుపేటలో సర్వే నెంబర్ మూడులో నాలుగు గుంటల భూమి కబ్జాకు గురైందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుశీల్‌కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షుడు కొంపెల్లి బానేష్, పెండ్యాల శ్రీకాంత్ ప్రత్యేకాధికారికి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని కబ్జాకు గురైన భూమిని తీసుకొని హద్దులు ఏర్పాటు చేసి కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజావాణిలో మండల ప్రత్యేకాధికారి కృష్ణ, ఎంపీడీవో టి.శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోటపల్లి: మండలంలో నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. ఎంపీడీవో భాస్కర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండలంలో జరిగే ప్రజావాణిలో సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారమయ్యేలా చూస్తామని తెలిపారు. ఏఈ బద్రీనాథ్, ఏపీఎం రాజన్న పాల్గొన్నారు.

వేమనపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో బాపురావు మండల స్థాయి అధికారులు కూడా పూర్తి స్థాయిలో హాజరుకాలేదు.



ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

నెన్నెల: మండల కేంద్రంలోని సర్వే నం.876లోని ప్రభుత్వ భూమిలో గ్రామపంచాయతీ అనుమతి లేకుండా సర్పంచ్ భర్త అక్రమంగా నిర్మించిన ఇంటిని తొలగించాలని సోమవారం ప్రజావాణిలో బెల్లంపల్లి ఆర్డీవో శ్యామలాదేవి, తహసీల్దార్ భూమేశ్వర్‌కు బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. అనుమతి లేకుండా ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించినందుకు బాధితుడితో పాటు పంచాయతీ సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో సూచించారు. ఫిర్యాదు చేసిన వారిలో మండల కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, నాయకులు దుర్గం కృష్ణ, తాజ్, జె.రాకేష్, పల్ల మహేష్, షారుఖ్, తిరుమల్, ఒరగంటి మహేష్, శ్రీను, రవి ఉన్నారు.

ప్రతిభను వెలికితీయడానికే పోటీలు



భీమారం: క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ..

భీమారం: మండల కేంద్రంలో చెన్నూర్ నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ని సోమవారం నిర్వాహకులు విశ్వతేజారెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ బాబర్‌ఖాన్ ప్రారంభించారు. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీయడానికే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తేజారెడ్డి తెలిపారు. పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన టీంకు రూ.50వేలు, ద్వితీయ బహుమతి సాధించిన టీంకు రూ.25వేలు నగదు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొత్తసత్తిరెడ్డి, పాడేటి రవి, బానోత్ శ్రీనివాస్‌నాయక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందారం సీనియర్ జట్టు విజేత

జైపూర్: మండలంలోని ఇందారంలో స్థానిక సర్పంచ్ గడ్డం మంజులప్రసాద్, వైఎస్ ఎంపీపీ పెద్దపల్లి రమేశ్, ఇందారం–2 ఎంపీటీసీ ఆర్కే స్వర్ణసంతోశ్ యాదవ్ ఆధ్వర్యంలో బాల్క సురేశ్ స్మారకార్థం నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగాయి. మండల వ్యాప్తంగా 20జట్లు పోటీల్లో పాల్గొనగా ఇందారం సీనియర్ జట్టు, నర్సింగాపూర్ మద్దులపల్లి జట్టు ఫైనల్‌కు చేరాయి. ఉత్సాహంగా సాగిన ఫైనల్ పోటీల్లో ఇందారం సీనియర్ జట్టు విజయం సాధించింది. నర్సింగాపూర్ మద్దులపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచింది.

తాగునీటి కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళలు

రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్: క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 9వ వార్డు తిమ్మాపూర్‌లో 15రోజులుగా మంచినీరు రావడం లేదని మహిళలు సోమవారం ఆందోళన చేపట్టారు. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో సుమారు నెల రోజులుగా తాగునీరు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

- ముఖ్య అతిథిగా హాజరైన సిర్పూర్ ఎమ్మెల్యే కోనప్ప



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సిర్పూర్ ఎమ్మెల్యే

భీమిని: క్రీడలు ఆడటం ద్వారా శారీరక ధారుఢ్యంతో పాటు మానసికోల్లాసం సైతం కలిగి స్తాయని సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కన్నెపల్లి మండలంలోని సాలిగాం గ్రామ పంచాయతీలో కోనేరు యువసేన ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. సాలిగాం గ్రామపంచాయతీకి రూ.24లక్షలతో సీసీ రోడ్ల కోసం మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లను ఇప్పిస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దహెగాం ఎంపీపీ సంతోష్‌గౌడ్, జెడ్పీటీసీ శ్రీరామరావు, కన్నెపల్లి జెడ్పీటీసీ కొటారపు సత్యనారాయణ, సాలిగాం సర్పంచ్ గంగక్క, ఉపసర్పంచ్ ప్రభాకర్, మాడవెల్లి సర్పంచ్ లచ్చక్క, ఉపసర్పంచ్ పోగుల విజయ–రమేష్, కన్నెపల్లి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రంగారావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఆకుతోట రాజన్న, బెల్లంపల్లి నియోజకవర్గ యువజన అధ్యక్షుడు మహేష్‌గౌడ్, కన్నెపల్లి ఉపసర్పంచ్ గద్దల వెంకటేష్, నాయకులు పోగుల రమేష్, వరిమడ్ల మల్లేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని కోమటిచేనులో జాడి మల్లేష్, రాంటెంకి రమాకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను జెడ్పీటీసీ చంద్రయ్య, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటుతూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంటెంకి శ్రీనివాస్, ఎంపీటీసీ చంద్రమౌళి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు దుర్గం పోశం, నాయకులు వాసుదేవ్, సుధాకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: రోడ్డు భద్రత అవగాహన కోసం హీల్ స్వచ్ఛంద సంస్థ, కార్తికేయన్ ఆసుపత్రి, గురు క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రత కప్ టీ 10 క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో చరణ్ 11, సతీశ్ స్మాషర్ల మధ్యలో జరిగిన హోరాహోరి మ్యాచ్‌లో చరణ్ 11 జట్టు గెలుపొందింది. విజేత జట్టుకు రూ.1.11లక్షలు, రన్నర్స్‌కు రూ.51వేలను నిర్వాహకులు అందించగా, మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌కు 42ఇంచుల ఎల్ఈడీ టీవీని శ్రీరక్ష అంబులెన్స్ నరేశ్ అందించారు. విజేతలకు నగదు బహుమతిని, ట్రోఫీని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో హీల్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్, అధ్యక్షుడు డాక్టర్ రమణ, జీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజరమేశ్, డాక్టర్ రఘువంశీ, డాక్టర్ సతీశ్ వర్మ, వార్డు కౌన్సిలర్ హరికృష్ణ, పోడెటి రాజు, బీఆర్ఎస్ నాయకులు తాజొద్దిన్, పూదరి ప్రభాకర్, పడాల రవీందర్, ఎగ్గెన సాయి, గురు క్రికెట్ అకాడమీ దుర్గ సాయి సంతోశ్, ప్రశాంత్, చందు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ముగింపు

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేటలో బీఆర్ఎస్ పార్టీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు సోమవారం ముగిశాయి. పార్టీ యుజవన పార్టీ జిల్లా అధ్యక్షుడు నడిపెల్లి విజిత్‌రావు హాజరై గెలుపు సాధించిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.8వేలు విజేతలకు తన సొంత ఖర్చులతో అందించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

రేపు బుగ్గ జాతర వేలం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలంలోని కన్నాల శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి దేవాలయలంలో ఫిబ్రవరి 18న జరిగే మహా శివరాత్రి జాతర వేలంను ఈ నెల 18న బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో బాపురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తైబజార్, టెంకాలయ విక్రయం, కొబ్బరి ముక్కల పోగు చేసుకోవడం, ప్రసాదాల విక్రయాలు, వాహనాల పార్కింగ్ నిర్వహణకు ఆలయ ఆవరణలో మధ్యాహ్నం 12గంటల నుంచి వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.



గౌరమ్మకి పూజలు

భీమారం: మండల కేంద్రంలోని శ్రీ కోదండరామాలయంలో ఆదివారం సాయంత్రం గౌరమ్మ(నోములు)లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రవీణ్ సూర్యహోమం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.